
# ట్రంప్ దెబ్బకు ఆటో విలవిల

## దిగుమతయ్యే వాహనాలపై 25 శాతం సుంకం

### వచ్చే వారం నుంచి అమల్లోకి కొత్త పన్ను




వాషింగ్టన్/న్యూఢిల్లీ, మార్చి 27: అగ్ర రాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనిచేశారు. విదేశాల్లో తయారై అమెరికాకు దిగుమతయ్యే కార్లపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తాజాగా ప్రకటించారు. కానీ, అమెరికాలో తయారైన కార్లపై ఎలాంటి సుంకం ఉండదని స్పష్టంచేయడం విశేషం. ఈ సుంకం పెంపు వచ్చే వారం నుంచి అమలులోకి రానున్నట్లు ప్రకటించారు. ఇది శాశ్వతమైన చర్యగా పేర్కొన్న ఆయన.. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థకు ప్రతియేటా 100 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరనున్నదని పేర్కొన్నారు. ఈ నిర్ణయం విదేశీ ఆటోమొబైల్ సంస్థలకు షాకిచ్చినట్లు అయింది. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ట్రంప్ సుంకాల పెంపును తెరపైకి తీసుకొస్తున్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతయ్యే ఏ వస్తువుపైన 25 శాతం సుంకం విధించనున్నట్లు గతంలోనే పేర్కొన్నారు.

**ప్రాణసంకటంగా ఆటోమొబైల్**

ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో విదేశీ ఆటోమొబైల్ సంస్థల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. యూఎస్‌కు ఎగుమతి చేయాలంటే అధికంగా పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఒకవేళ ధరలు పెంచితే వాహన అమ్మకాలు పడిపోయే ప్రమాదం ఉన్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అమెరికా మార్కెట్లో సరాసరి కారు ధర 49 వేల డాలర్లు ఉండగా, త్వరలో భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతయ్యే కారుపై విధిస్తున్న సుంకం 12,500 డాలర్లకు ఎగబాకనున్నది. ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో దేశీయ ఎగుమతులపై నీలి నీడలు కమ్ముకోనున్నది. ప్రతియేటా భారత్ నుంచి 7 బిలియన్ డాలర్ల విలువైన కార్లు అమెరికాకు ఎగుమతి అవుతుండగా..తాజా నిర్ణయంతో ఆయా సంస్థలు వెనక్కితగ్గే అవకాశాలున్నాయి. ప్రధానంగా యూఎస్ మార్కెట్లో పాగావేసిన టాటా మోటర్స్ అనుబంధ సంస్థ జేఎల్ఆర్‌పై ఈ ప్రభావం అధికంగా పడనున్నది. బ్రిటన్ ప్లాంట్లో తయారైన జేఎల్ఆర్ వాహనాలను ప్రతియేటా లక్షల వాహనాలను అమెరికాకు ఎగుమతి చేస్తుండటమే ఇందుకు కారణం. సుంకాల పెంపు ప్రతిపాదనపై వాహన సంస్థలతోపాటు వాహన విడిభాగాల తయారీ సంస్థలు కూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఈ టారిఫ్ బాదుడుతో తమ ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం చూపనున్నాయని వారు వాపోతున్నారు. 2024లో భారత్ నుంచి 2.2 బిలియన్ డాలర్ల విడిభాగాలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి.

**కుప్పకూలిన ఆటో షేర్లు**

ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో దేశీయ ఆటోమొబైల్ రంగ షేర్లు కుప్పకూలాయి. టాటా మోటర్స్ షేరు అత్యధికంగా 5.50 శాతం నష్టపోయింది. దీంతోపాటు అశోక్ లేలాండ్ 2.77 శాతం తగ్గగా, ఐచర్ మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, అపోలో టైర్స్ షేర్లు పతనం చెందాయి. మొత్తంగా ఆటో ఇండెక్స్ ఒక్క శాతం తగ్గి 48,220.85కి పడిపోయింది. వీటితోపాటు వాహన విడిభాగాల తయారీ సంస్థల షేర్లు కూడా ఒత్తిడికి గురయ్యాయి. సోనా బీఎల్ డబ్ల్యూ షేరు 5.89 శాతం నష్టపోగా, సంవర్ధన్ మదర్‌సన్ ఇంటర్నేషనల్ 2.22 శాతం, భారత్ ఫోర్జ్ 2.30 శాతం, ఏఎస్‌కే ఆటోమోటివ్ లిమిటెడ్ 1.83 శాతం, రామ్‌కృష్ణ ఫార్జింగ్స్ షేర్లు పతనం చెందాయి.

**సుంకాలను తగ్గిస్తాం: భారత్**

కొన్ని అమెరికా ఉత్పత్తులపై సుంకాలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేసింది. అయితే అగ్రరాజ్యం అమెరికా ఒత్తిడికి తలొగ్గి ఈ నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టంచేశాయి. 23 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ప్రతియేటా భారత్ దిగుమతి చేసుకుంటున్నది. ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా దిగుమతి చేసుకునే వస్తువులపై టారిఫ్‌ను 55 శాతం వరకు తగ్గించడానికి భారత్ అంగీకరించినట్లు ప్రభుత్వ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి.





# 1 ముకేశ్ 2 అదానీ

**రూ.8.6 లక్షల కోట్ల సంపదతో ఆసియా శ్రీమంతుడు / రూ.8.4 లక్షల కోట్లతో ఆ తర్వాతి స్థానంలో గౌతమ్**

## దేశ జీడీపీలో మూడోవంతు 284 మంది కుబేరుల సంపద

### హురున్ ఇండియా జాబితాలో వెల్లడి..

ముంబై, మార్చి 27: దేశీయ శ్రీమంతుడు ముకేశ్ అంబానీ సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. గడిచిన ఏడాదికాలంలో ఆయన సంపద 13 శాతం తరిగిపోయి రూ.8.6 లక్షల కోట్లకు పరిమితమైనట్లు ప్రస్తుత సంవత్సరానికిగాను హురున్ ఇండియా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అయినప్పటికీ దేశీయ శ్రీమంతుల జాబితాలో తొలిస్థానంలో నిలిచినట్లు పేర్కొంది. కానీ, ప్రపంచవ్యాప్తంగా 100 బిలియన్ డాలర్ల సంపద కలిగిన కుబేరుల జాబితా నుంచి వైదొలిగినప్పటికీ ఆసియా కుబేరుడిగా కొనసాగుతుండటం విశేషం. కానీ, ఇదే సమయంలో అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ లక్ష కోట్ల రూపాయల సంపదను పోగేసుకొని ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచినట్లు నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది జనవరి 15తో ముగిసిన ఏడాది కాలంలో గౌతమ్ అదానీ రూ.8.4 లక్షల కోట్ల సంపదను కలిగివున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం భారత్‌లో 284 మంది బిలియనీర్లు ఉండగా, వీరి సంపద ఏడాది ప్రాతిపదికన 10 శాతం ఎగబాకి రూ.98 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. లేదా దేశ జీడీపీలో మూడోవంతు వీరివద్ద ఉన్నది.

**చైనాను అధిగమించిన భారత్**

భారత్ మరో రికార్డు సృష్టించింది. కుబేరుల సరాసరి సంపదలో తన పొరుగు దేశమైన చైనాను అధిగమించి రికార్డు నెలకొల్పింది. భారత్‌లో ఒక్కొక్కరి సంపద రూ.34,514 కోట్లు కాగా, అదే చైనాలో ఇది రూ.29,027 కోట్లుగా ఉన్నది. మరోవైపు, 175 మంది బిలియనీర్ల సంపద పెరగగా, 109 మంది సంపద హరించుకుపోయింది.

**ప్రపంచ కుబేరుడిగా ఎలాన్ మస్క్**

టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 420 బిలియన్ డాలర్ల వ్యక్తిగత సంపదతో ప్రపంచ కుబేరుల జాబితాలో తొలిస్థానంలో నిలిచారు. గడిచిన ఏడాదికాలంలో ఈ సంస్థ అంచనాలకుమించి రాణించడం వల్లనే సంపద భారీగా పెరగడానికి ప్రధాన కారణం. అలాగే ఈ జాబితాలో 266 బిలియన్ డాలర్లతో అమెజాన్ ఫౌండర్ జెఫ్ బెజోస్ రెండో స్థానంలో నిలువగా.. మెటా కో-ఫౌండర్, సీఈవో మార్క్ జుకర్‌బర్గ్(242 బిలియన్ డాలర్లు), ఒరాకిల్ కో-ఫౌండర్ ల్యారీ ఎల్లిసన్(203 బిలియన్ డాలర్లు), బర్క్‌షైర్ హ్యాథ్‌వేస్ సీవో వారెన్ బఫెట్(167 బిలియన్ డాలర్లు) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు.

**తెలుగు టాప్-10 శ్రీమంతుల జాబితా**

| ర్యాంక్ | పేరు | సంపద(బిలియన్ డాలర్లలో) |
|---|---|---|
| 260 | మురళీ దివిస్ | 10 |
| 600 | పీ పిచ్చి రెడ్డి | 5.8 |
| 625 | పీవీ కృష్ణా రెడ్డి | 5.6 |
| 1122 | ప్రతాప్ రెడ్డి | 3.3 |
| 1122 | పీవీ రాంప్రసాద్ రెడ్డి | 3.3 |
| 1198 | పీ పార్థసారథి రెడ్డి | 3.1 |
| 1624 | కే సతీష్‌రెడ్డి | 2.3 |
| 1796 | ఎస్ సుబ్రమణ్య రెడ్డి | 2.1 |
| 1796 | సీ వెంకటేశ్వర రెడ్డి | 2.1 |
| 1796 | ఎం సత్యనారాయణ | 2.1 |




## టీవీని అధిగమించిన డిజిటల్ మీడియా

న్యూఢిల్లీ, మార్చి 27: డిజిటల్ మీడియా అంచనాలకుమించి రాణిస్తున్నది. 2024లో టెలివిజన్ రంగాన్ని అధిగమించి మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో అతిపెద్ద సెగ్మెంట్‌గా అవతరించినట్లు ఫిక్కీ-ఈవై నివేదికలో వెల్లడించింది. మీడియా-ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో వచ్చిన మొత్తం ఆదాయంలో డిజిటల్ మీడియా రంగ వాటా 32 శాతంగా ఉన్నదని పేర్కొంది. ఇదే క్రమంలో 2026లో డిజిటల్ మీడియా లక్ష కోట్ల రూపాయలకు చేరుకుంటుందని అంచనావేస్తున్నది. ఇదే క్రమంలో మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగం రూ.3 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. 2024లో ఇది రూ.2.5 లక్షల కోట్లు.

## భువనగిరిలో ఎఫ్ఎల్‌వో స్కిల్ సెంటర్

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్‌వో) రాష్ట్రంలో స్కిల్ సెంటర్‌ను నెలకొల్పబోతున్నది. హైదరాబాద్‌కు సమీపంలోని భువనగిరి వద్ద పది ఎకరాల స్థలంలో ఈ స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ కొత్త చైర్‌పర్సన్ ప్రతిభా కుందా తెలిపారు. తద్వారా రెండు వేల మంది మహిళలు, విద్యార్థినులకు ప్రతిభలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఎఫ్ఎల్‌వో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా వెయ్యి మంది యువతకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను ఎఫ్ఎల్‌వో నూతన కార్యవర్గం గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

## బీవోబీ 'పీఎం-విద్యాలక్ష్మి స్కీం'

### ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న బ్యాంక్

న్యూఢిల్లీ, మార్చి 27: ప్రభుత్వరంగ ఆర్థిక సేవల సంస్థ బీవోబీ.. నూతన ప్రధాన్ మంత్రి విద్యాలక్ష్మి (పీఎం-విద్యాలక్ష్మి) స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ స్కీంను ప్రవేశపెట్టింది. ఉన్నత చదువులకోసం ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం-విద్యాలక్ష్మి స్కీంను ప్రవేశపెట్టింది. ఈ స్కీంనకు అనుగుణంగా బ్యాంక్ ఆఫ్ బరోడా..పీఎం-విద్యాలక్ష్మి పోర్టల్ కింద దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంట్లో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న 8,300 శాఖల్లో ఎడ్యుకేషన్ లోన్ సాంక్షనింగ్ సెల్స్, 119 రిటైల్ అసెట్స్ ప్రాసెసింగ్ సెల్స్‌లను ఏర్పాటు చేసినట్లు బీవోబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ ముదలియార్ తెలిపారు. మొత్తం ప్రాసెసింగ్ పూర్తిస్థాయిలో డిజిటల్‌లోనే జరుగుతున్నదని, ఈ వినూత్న స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చిన తొలి బ్యాంక్ బీవోబీనేనని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు రూ.7.5 లక్షల వరకు రుణం లభించనున్నదని, దీంట్లో 75 శాతం క్రెడిట్ గ్యారెంటీగా కేంద్ర ప్రభుత్వం ఉంటుందన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై రాహుల్‌గాంధీ చొరవ చూపాలి

- రాహుల్‌కు బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం లేఖ

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): బీసీలకు విద్యా, ఉపాధి, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని.. అందుకు కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చొరవచూపాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాహుల్‌గాంధీకి గురువారం బహిరంగ లేఖ రాశారు. ప్రత్యేక పరిస్థితుల్లో 50% పరిమితిని మించవచ్చని, న్యాయపరమైన సమస్యలు ఎదురైతే ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని కోరారు.

## ఎంజీయూలో మంటలు

రామగిరి , మార్చి 27 : నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో గురువారం రాత్రి మంటలు చెలరేగాయి. పరీక్షల విభాగం పరిసరాలు మొదలుకుని ఇంజినీరింగ్ కళాశాల వరకు 120 ఎకరాల్లో ఉన్న చెట్లు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మూడు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు.

## రిటైర్డ్ ఉద్యోగులు ఔట్

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): రిటైర్డ్ అయినా ఇంకా విధుల్లో కొనసాగుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం వేటువేసింది. వారందరినీ తొలగించాలని ఆదేశించింది. సచివాలయంతోపాటు అన్ని శాఖలు, ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్లు, ఏజెన్సీలలో ఎక్స్‌టెన్షన్, రీఅపాయింట్‌మెంట్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్న విశ్రాంత అధికారులు, సిబ్బందిని ఈ నెల 31లోగా తొలగించాలని సీఎస్ శాంతి కుమారి ఆదేశాలు జారీచేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధిశాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 177 మందిని తొలగించాలని ప్రభుత్వ అదనపు కార్యదర్శి సైదా గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

## 29, 30,31న తెరిచివుండనున్న ఐటీ ఆఫీస్‌లు

న్యూఢిల్లీ, మార్చి 27: 29-31 వరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆదాయ పన్ను కార్యాలయాలు తెరిచివుండనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను పన్ను చెల్లింపుదారులు తమ పన్ను బకాయిలను చెల్లించడానికి ఈ శని, ఆది, సోమవారాల్లో ఆఫీస్‌లను తెరిచివుంచుతున్నట్లు సీబీడీటీ వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనుండటంతో అదేరోజు ప్రభుత్వ చెల్లింపులు పూర్తి చేయాల్సి వుంటుంది.

## 23 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తులు

- మే 18న రెండు సెషన్లలో పరీక్ష
- రాష్ట్రంలో 13 సెంటర్ల ఏర్పాటు

**జేఈఈ అడ్వాన్స్‌డ్ షెడ్యూల్..**

| | |
|---|---|
| రిజిస్ట్రేషన్ ప్రారంభం | 23-4-2025 |
| దరఖాస్తుల గడువు | 02-5-2025 |
| ఫీజు చెల్లింపు గడువు | 05-5-2025 |
| అడ్మిట్‌కార్డుల విడుదల | 11- 5-2025 |
| పరీక్ష తేదీ | 18-5-2025 |
| రెస్పాన్స్ షీట్ల విడుదల | 22-5-2025 |
| ప్రాథమిక కీ విడుదల | 26-5-2025 |
| ఫలితాల విడుదల | 02-06-2025 |

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా గల ఐఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను రాష్ట్రంలో 13 పట్టణాల్లో నిర్వహించనున్నారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షకు ఇంజినీరింగ్ కాలేజీలు, టీసీఎస్ అయాన్ సెంటర్లలో కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. ఇప్పటికే నిర్వహించిన జేఈఈ మెయిన్స్ తుది ఫలితాలు ఏప్రిల్ 23 లేదా అంతకంటే ముందే విడుదలకానున్నాయి. ఏప్రిల్ 23 నుంచి అడ్వాన్స్‌డ్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానున్నది. మే 18న రెండు సెషన్లలో పరీక్షను నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో సెషన్ నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండు సెషన్లకు హాజరుకావాల్సి ఉంటుంది. మెయిన్స్ రాసిన వారిలో మెరిట్ ఆధారంగా 2.5 లక్షల మంది విద్యార్థులను అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేసే అవకాశం కల్పిస్తారు. ఫలితాలను జూన్ 2న విడుదల చేసి ఆ తర్వాత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసి సీట్లను భర్తీచేస్తారు.

**రాష్ట్రంలో పరీక్ష కేంద్రాలు..**

ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్.

## పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థికి అస్వస్థత

- స్కిన్ అలర్జీ, కడుపునొప్పితో బాధపడుతున్న 56 మందికి చికిత్స
- వరుస ఘటనలతో ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



చికిత్స పొందుతున్న విద్యార్థి హర్ష

మెట్‌పల్లి రూరల్, మార్చి 27: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. మెట్‌పల్లికి చెందిన రాపర్తి హర్ష గురువారం కుడిచేతికి నొప్పి వస్తున్నదని, కండ్లు తిరుగుతున్నాయని ప్రిన్సిపాల్ మాధవీలతతో తెలిపాడు. వెంటనే కోరుట్ల దవాఖానలో చేర్పించగా వైద్యులు చికిత్స అందించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ హర్షను పరామర్శించారు. విద్యార్థి పరిస్థితి నిలకడగా ఉండటంతో ఇంటికి పంపించారు. నిరుడు జూలై 26న అస్వస్థతకు గురై కోలుకున్న హర్ష మళ్లీ అస్వస్థతకు గురవడం ఆందోళన కలిగించింది. పెద్దాపూర్ గురుకులంలో అయిలాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సమీనా ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 56 మంది విద్యార్థులు స్కిన్ అలర్జీ, కడుపునొప్పితో బాధపడుతున్నట్టు గుర్తించి చికిత్స అందించారు. గతేడాది జూలై 26న ఓ విద్యార్థి, ఆగస్టు 9న మరో విద్యార్థి మృతిచెందగా, పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురై కోలుకున్నారు. గత డిసెంబర్ 18న మరో విద్యార్థి అస్వస్థతకు గురై ప్రాణాలతో బయటపడిన ఘటన మరవకముందే మరో విద్యార్థి అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

## ఒకే లెక్చరర్‌కు రెండు చోట్ల పోస్టింగ్

### పోస్టింగుల్లో ఇంటర్‌బోర్డు లీలలు

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఇంటర్ విద్యలో కొత్త లెక్చరర్లకు పోస్టింగ్స్‌లో వింతలు చోటుచేసుకున్నాయి. ఒకే లెక్చరర్‌కు రెండు కాలేజీల్లో పోస్టింగ్‌నిచ్చారు. రెండు ఉత్తర్వులు ఒకే తేదీన ఇవ్వడం గమనార్హం. నేనావత్ లాలు సివిక్స్ లెక్చరర్‌గా ఎంపిక కాగా మల్టీ జోన్-2లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ గట్టు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ పటాన్‌చెరువులో పోస్టింగ్‌నిచ్చారు. రెండుచోట్ల పోస్టింగ్ ఇవ్వడం అధికారులు తప్పిదమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో ఇంటర్‌బోర్డులో మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీల్లోని రెండో సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేందుకు అనుమతించారు. ఎవరిని సంప్రదించకుండానే ఓ అధికారి కావాలనే అనుమతినిచ్చినట్టుగా తేలింది. తాజాగా మరో కీలక అధికారి సెక్షన్‌లో తప్పిదం జరగడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

# టెన్త్ ఫెయిల్ సర్కార్!

- విద్యార్థుల భవితవ్యంతో ప్రభుత్వం చెలగాటం
- రోజుకోచోట పేపర్ లీకేజీ
- అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న కాంగ్రెస్ నాయకులు
- ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు
- సీఎం రేవంత్ వద్దనే విద్యాశాఖ
- కార్పొరేట్ స్కూళ్లతో రేవంత్ కుమ్మక్కయ్యారా?
- ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిప్పులు
- బోర్డును ముట్టడించిన బీఆర్ఎస్వీ
- హైకోర్టుకు చేరిన నకిరేకల్ పేపర్ లీకేజీ వివాదం

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ)/జియాగూడ/శాలిగౌరారం/కాగజ్‌నగర్: కాంగ్రెస్ పదిహేను నెలల పాలనలో అన్నిరంగాల్లో విఫలమైందని విమర్శలు ఎదుర్కొంటున్నది. రేవంత్ సర్కార్‌కు కనీసం టెన్త్ పరీక్షలు కూడా నిర్వహించడం చేతకావడం లేదని విపక్షాల నేతలు, విద్యార్థులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు. పదోతరగతి పరీక్షలు మొదలైనప్పటి నుంచి రోజుకోచోట ప్రభుత్వ వైఫల్యం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్షలు జరిగిన నాలుగు రోజుల్లో నాలుగు లీకేజీలు, తప్పిదాలు బయటపడ్డాయి. మరో మూడు పరీక్షలు జరగాల్సి ఉండగా, వీటిలో ఎన్ని తప్పిదాలు వెలుగుచూస్తాయో అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ సీఎం వద్దే ఉన్నా పరీక్షల నిర్వహణపై ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని, అందుకే పరీక్షల నిర్వహణలో వరుస తప్పిదాలు జరుగుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. పరీక్షల నిర్వహణలో తప్పిదాలతో రేవంత్ ప్రభుత్వం 'టెన్త్ ఫెయిల్ సర్కార్'గా విమర్శలు ఎదుర్కొంటున్నది.

**గందరగోళంగా పరీక్షలు.. నిలదీస్తే కేసులు**

టెన్త్ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు ఒక్కొక్కటికిగా బయటపడుతుంటే సరిదిద్దుకోవాల్సిన సర్కారు నిలదీసిన వారిపై కేసులు పెట్టడం దారుణమని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నకిరేకల్ లీకేజీ వ్యవహారంపై సోషల్ మీడియాలో పోస్ట్‌పెట్టి, ప్రభుత్వ చేతగానితనాన్ని బయటపెడితే కక్షసాధింపులెందుకని ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ నేతలు మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్‌పై మూడు కేసులు పెట్టడం దారుణమని మండిపడుతున్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును జోడించడం దుర్మార్గమని నిప్పులు చెరుగుతున్నారు.

**కార్పొరేట్ స్కూళ్లతో రేవంత్ లాలూచీ: గెల్లు శ్రీనివాస్‌యాదవ్**

విద్యాశాఖను తన వద్దనే పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలతో కుమ్మక్కయ్యారని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. పదోతరగతి ప్రశ్నపత్రాల లీకేజీ, నిర్వహణలో లోపాలను నిరసిస్తూ గురువారం బీఆర్ఎస్వీ నేతలు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఎస్సెస్సీ బోర్డును ముట్టడించారు. పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసలు నిందితులను పోలీసులు తప్పిస్తూ, బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శలు గుప్పించారు.



ఎస్సెస్సీ బోర్డు వద్ద బీఆర్ఎస్వీ ధర్నాను అడ్డుకొని రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థిని**

మొదటిరోజు పరీక్ష సందర్భంగా నకిరేకల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఎస్ఎల్‌బీసీ గురుకుల పాఠశాల సెంటర్‌లోకి ప్రవేశించి, విద్యార్థిని ప్రశ్నపత్రాన్ని లాక్కుని, ఫొటో తీసుకుని, వాట్సాప్‌లో సర్క్యులేట్ చేశారు. ఈ ఘటనలో అధికారులు డిబార్ చేశారు. పేపర్ లీకేజీ కేసులో తనకు సంబంధం లేదని, ఎవరో ఎగ్జామ్ సెంటర్లోకి వచ్చి పేపర్ లాక్కుంటే తనపై చర్యలు తీసుకోవడం సరికాదంటూ ఆమె హైకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు గురువారం ఆమె తరఫున న్యాయవాది హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. తనకు అన్యాయం జరిగిందని, పరీక్షకు అనుమతివ్వాలని కోరుతూ పేర్కొన్నారు. పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి ఏప్రిల్ 7న కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నల్లగొండ డీఈవో, బోర్డ్ సెక్రటరీ, నకిరేకల్‌లోని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

**లీకేజీ స్కామ్... రేవంత్ అడ్డదారులు**

పేపర్ లీకేజీ స్కామ్ నుంచి తప్పించుకొనేందుకు సీఎం రేవంత్ అడ్డదారులు తొక్కుతున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఈ కుట్ర కోణంలో భాగంగానే ఎస్సీ, ఎస్టీల పక్షాన పోరాడుతున్న కేటీఆర్‌పై ఫేక్ అట్రాసిటీ కేసు పెట్టారని ధ్వజమెత్తారు.



టెన్త్ గణిత ప్రశ్నల లీకేజీ కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

## ప్రశ్నల లీకేజీ కేసులో నిందితుల అరెస్టు

### 8 మంది రిమాండ్.. మరో ముగ్గురు పరారీ

కామారెడ్డి, మార్చి 27: కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో బుధవారం గణిత పరీక్ష ప్రశ్నలు లీక్ చేసిన కేసులో పోలీసులు 8 మందిని అరెస్టుచేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఎస్పీ రాజేశ్‌చంద్రం గురువారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. జుక్కల్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థి వాటర్ సప్లయ్‌చేసే వ్యక్తితో కొన్ని ప్రశ్నలు పేపర్‌పై రాసి బయట ఉన్న తన తండ్రికి పంపించాడు. ఆ పేపర్‌ను విద్యార్థి తండ్రి కారోబార్‌కు ఇచ్చి జవాబులు తేవాలని కోరగా ఆయన అక్కడ ఉన్న ఓ విలేకరికి పంపించాడు. అతడి నుంచి యూట్యూబ్ రిపోర్టర్‌కు రాగా అతడు మరో రిపోర్టర్‌కు వాట్సాప్‌లో పంపించాడు. అతడు ఆ పేపర్‌ను క్లిప్పింగ్‌గా మార్చి డిజిటల్ మీడియా గ్రూప్‌లో పోస్టుచేశారు. ఇది వైరల్‌గా మారడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ రంగంలోకి దిగింది. ఈ క్రమంలో మాల్‌ప్రాక్టీస్‌కు యత్నించిన 11 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు 8 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఓ యూట్యూబ్ చానల్ విలేకరి, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ ఉన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

**పదోతరగతి పరీక్షల్లో ఎప్పుడేం జరిగింది?**

| రోజు | పరీక్ష | ఎక్కడ? | ఏం జరిగింది? |
|---|---|---|---|
| మార్చి 21 | తెలుగు | నకిరేకల్ | వాట్సాప్‌లో ప్రశ్నపత్రం చక్కర్లు |
| మార్చి 21 | తెలుగు | మంచిర్యాల | తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రం తీసుకెళ్లారు, పరీక్ష 2 గంటలు లేట్ |
| మార్చి 21 | తెలుగు | వికారాబాద్ | తెలుగుకు బదులు తెలుగు కాంపోజిట్ పేపర్ పంపిణీ |
| మార్చి 26 | గణితం | జుక్కల్ | ప్రశ్నలు లీక్ (స్లిప్‌పై రాసిన ప్రశ్నలు బయటకు) |

## 26 వేల స్కూళ్లను గాలికొదిలేసిన సర్కారు : టీపీటీఎఫ్

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 26 వేల స్కూళ్లు, వెయ్యికిపైగా గురుకుల పాఠశాలలను కాంగ్రెస్ సర్కారు గాలికొదిలేసిందని టీపీటీఎఫ ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయనున్న ఇంటర్నేషనల్ స్కూళ్లకు కేటాయించిన బడ్జెట్‌లో సగం సర్కారు స్కూళ్లకిస్తే బడులు బాగుపడతాయని పేర్కొంది. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో టీపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, తిరుపతి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## టెన్త్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : మధ్యాహ్న భోజన పంపిణీ విషయంలో పాఠశాల విద్యాశాఖ తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. సర్కారు బడుల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందించాలని గురువారం ఆదేశాలిచ్చింది. ఇది సర్కారు బడుల్లో సెంటర్లు ఉన్న చోటనే వర్తిస్తుంది. ఈ సెంటర్లలో ప్రభుత్వ, ప్రైవేట్ అన్న తేడాల్లేకుండా పరీక్ష పూర్తయిన తర్వాత మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించింది. అయితే పరీక్షలకు ముందే ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం వరకు నాలుగు పరీక్షలు అయిపోయాయి. మరో మూడు పరీక్షలు మాత్రమే ఉన్నాయి. ఆ తర్వాత కొన్ని మైనర్ సబ్జెక్టులకు సైతం పరీక్షలు జరుగుతాయి.

## ఉగాది, రంజాన్‌కు సెలవులివ్వరా?

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకన కేంద్రాలకు సెలవులపై స్పష్టత కొరవడింది. ఇంతకు సెలవులిస్తారా ? లేదా? అన్నది సందిగ్ధత నెలకొన్నది. ఈ నెల 30న ఉగాది కాగా, ఆ వెంటే (ఈ నెల 31న లేదా ఏప్రిల్ 1) రంజాన్ పండుగ రానున్నది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 19 మూల్యాంకన కేంద్రాల్లో ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం నడుస్తున్నది. అధ్యాపకులు, సిబ్బంది అంతా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ రెండు పండుగలకు నో వర్క్ నో పే కింద సెలవు ప్రకటించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (టిగ్లా) అధ్యక్షప్రధాన కార్యదర్శులు వీ శ్రీనివాస్, కే సురేశ్ ఇంటర్ బోర్డు కార్యదర్శి క్రిష్ణాదిత్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.